వీరూ కిందపడి ఉన్న పిస్తోలుని అందుకోడానికి ముందుకు వచ్చాడు.

ఉండేలు బద్దనుండి మరో రాయి వచ్చివీరూ గుండుని తాకింది.

"హా.... బాస్....." అన్నాడు బాధగా. వీరూ అప్పటికప్పుడే నిమ్మకాయంత సైజులో పొంగిన బొడిపెని తడుముకుంటూ.

రాంబాబు చెంగున ముందుకి దూకి పిస్తోలుని దొరకబుచ్చుకున్నాడు.

"రౌడీలు..... ఎటాక్ హిమ్...." భీమేశ్వరరావు చూపిస్తూ అరిచాడు రంగనాథరావు.

రౌడీలందరూ భీమేశ్వరరావు వైపు పరుగు తీశారు.

కానీ అంతలోనే భీమేశ్వరరావు వెనకనుండి బిలబిలమంటూ కండలు తిరిగిన వస్తాదులు ముందుకు వచ్చారు. వాళ్ళందర్నీ భీమేశ్వరరావు వ్యాయామశాల నుండి తీసుకొచ్చాడు.

రౌడీలకీ వస్తాదులకీ కాస్సేపు ద్వంద్వ యుద్ధం జరిగింది. వస్తాదులు రౌడీలందర్ని చిత్తుచిత్తుగా తన్నారు.

"మరేమో రౌడీలందర్నీ ఉద్యోగంలోంచి తీసేసి మిమ్మల్ని చేర్చుకుంటాను.... నాతో చేర్తారా?.... " వస్తాదుల్ని అడిగాడు రంగనాథరావు.

"షటప్.... నోర్మూయ్!...." అన్నాడు భీమేశ్వరరావు కండలు తిప్పుతూ.

వస్తాదులు గ్లాస్ కాబిన్ బద్దలు కొట్టుకుని రంగనాథరావుని రెక్కలు విరిచి పట్టుకున్నారు.

అంతలో ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్ అరడజను కానిస్టేబుల్స్‌తో అక్కడికి ఉరుకులు పరుగులు మీద వచ్చాడు.

" ఎవ్వరూ కదలకండి.... షూట్ చేసేస్తాను...." దెబ్బలు తిని నేల మీద పొర్లుతున్న రౌడీలతో అన్నాడు శ్రీరామ్.

"వీడే సార్ బిగ్‌బాస్...." అంటూ రంగనాథరావు రెక్కలు విరిచి శ్రీరామ్ ముందు నిలబెట్టారు.

"అరెస్ట్ హిమ్.... అతని చేతులకి బేడీలు వెయ్యండి.. లేకపోతే షూట్ చేస్తాను..."

కానిస్టేబులు నూట పదకొండు రంగనాథరావు చేతికి బేడీలు వేశాడు.

" మీరు సరియైన సమయానికి మాకు ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చారు.... మా డిపార్టుమెంటు నుండి మీకు బహుమతి ఇప్పిస్తాను..." భీమేశ్వరరావు భుజం, తట్టాడు ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్.

"నేనేం బిగ్‌బాస్‌ని కాదు.... నాకు ఈ స్మగ్లింగ్ యాక్టివిటీస్‌తో సంబంధం ఏం లేదు...." అన్నాడు రంగనాథరావు.

"మేమేం ఫూల్స్‌కాము.... నిన్ను రెడ్ హ్యాండెడ్‌గా ఈ డెన్‌లో పట్టుకున్నాం... మాదగ్గర రుజువులు కూడా ఉన్నాయ్. మీ యింట్లో స్మగ్లింగ్‌కి సంబంధించిన కాగితాలు కూడా దొరికాయ్... నీ భార్య నీ యాక్టివిటీస్‌కి అడ్డుతగుల్తుందని ఆమెని హత్య చేయించావ్.... ఈ జగ్గూ వీరూలే ఆమెని హత్య చేశారు...." అన్నాడు శ్రీరామ్.

"బాబాయ్.... మాకేం తెలీదు.... మేమెవర్నీ హత్య చెయ్యలేదు...." అన్నారు జగ్గూ వీరూ.

"మీరు హత్య చెయ్యడానికి మీదికి వెళ్ళినప్పుడు నీలిమ మిమ్మల్ని ఫోటో తీసింది.... చూడండి...."

శ్రీరామ్ జేబులోంచి ఫోటోగ్రాఫ్ దీసి వాళ్ళకి చూపించాడు.

అందులో జగ్గూ, వీరూలు కత్తులు పట్టుకుని పడ్డారు.

ఆ ఫోటోలు చూసే సరోజ సంతోషంతో కేకలేసింది.

జగ్గూ వీరూలు అయోమయంగా బుర్రలు గోక్కున్నారు. తాము హత్య చెయ్యడానికి వెళ్ళినప్పుడు నీలిమ తమని ఫోటో తియ్యలేదు.... మరి ఈ ఫోటో ఎలా వచ్చింది?...

నీలిమ తనని హత్య చేయడనికి వచ్చిన జగ్గూ, వీరూలని ఫోటో తీస్తే వాళ్ళు ఆ కెమెరాని ఎందుకు వదిలి పెట్టారో అక్కడవున్న ఎవరికీ అర్థంకాలేదు.

కానీ జరిగింది మాత్రం ఇది.

జగ్గూ, వీరూలు నిలిమని హత్యచేయడానికి అడుగులు ముందుకు వేస్తూ కత్తులు ఎత్తినప్పుడు ఆమె చేతిలోని కెమెరా జారి కిందపండింది. పడడం ఎలా పడిందంటే కెమెరా తలకిందులుగా నేలకి బటన్ తగిలేటట్టుపడింది. ఆ విధంగా కెమెరా బటన్ ప్రెస్ అయి, క్లిక్ అయి జగ్గూ వీరూలు ఫోటోలు తియ్యబడ్డారు.

జగ్గూ, వీరూలు తలలు వంచుకున్నారు.

అందర్నీ పోలీసు వ్యానులో ఎక్కించుకుని వెళ్ళాడు శ్రీరామ్.

ఆ విధంగా రాంబాబు కై ౯ం, స్మగ్లింగ్ విషవలయాల్లోంచి బయట పడ్డాడు.

నాగరాజు, సుబ్బలక్ష్మిల పెళ్ళి జరిగిపోయింది. పరంధామయ్య ముందుచిందులు వేసినా రాజశేఖరానికి ఉన్న ఆస్థిని చూసి రాంబాబు సరోజల పెళ్ళికి ఒప్పుకున్నాడు.

నాగరాజు ఊరికే జులాయిలా తిరగకుండా తనకి రెండో అసిస్టెంటుగా వేస్కున్నాడు రాంబాబు.

ఒకానొక శుభ ముహూర్తాన రాంబాబు, సరోజల పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది.

ఆ రోజు వాళ్ళకి శోభనం.

రాంబాబు మల్లెలతో అలంకరించిన పందిరి మమ్చం మీద కూర్చున్నాడు.

సరోజని గదిలోకి తోసి బయటనుండి తలుపేశారు. ఆమె మెల్లగా నడుచుకుంటూ వచ్చిపక్కనే మంచం మీద కూర్చుంది.

రాంబాబు చటుక్కున లేచి నిలబడ్డాడు.

"అదేంటి అలా నిలబడ్డావు... కూర్చో రాంబాబూ" అంది సరోజ.

రాంబాబు కూర్చుని చేతి వేళ్ళవంక చూస్కోసాగాడు.

"ఏమైనా మాట్లాడు రాంబాబూ...." అంది సరోజ.

"ఇది మన తొలిరాత్రి.... ఈ రాత్రి జీవితంలో మరుపురానిది.... ఎన్నెన్నో అనుభవాలు పంచుకునే రాత్రి.... యదలోని కోర్కెలకి రూపం కల్పించుకొనే ఈ రాత్రి.... ఈ రాత్రి.... ఈ

రాత్రి....."

రాంబాబు బుర్ర గోక్కుని వెనక్కి తిరిగి తలగడ పైకెత్తి దాని కింద ఉన్న నోట్ పుస్తకం కాగితాలూ అటూ ఇటూ తిప్పసాగాడు.

సరోజ రాంబాబు చేతిలోని నోటు పుస్తకం లాక్కుని పేజీలు తిప్పి చూసి పకపక నవ్వింది.

"ఎందుకిలా?... మాములుగా మాట్లాడొచ్చుగా?" అంది నవ్వును ఆపుకుంటూ.

"మాట్లాడొచ్చనుకో..... కానీ ఏమి తోచడంలేదు.... నేనేం ఇలా అనుకోలేదు.... వెధవ.... ఈ రాతలన్నీ కిష్టయ్యగాడే రాసిచ్చాడు... ఏదో సినిమాలో ఉన్నాయట!" రాంబాబు సిగ్గుపడుతూ చెప్పాడు.

"అన్నటు రాంబాబు నికో గుడ్‌న్యూస్....."

"ఏంటది?"

"ఇప్పుడే కిష్టయ్య నాకీ లెటర్ తెచ్చి ఇచ్చాడు. స్టూడియో అడ్రసుకి వచ్చిందట. విజన్ కెమెరా కంపెనీ వాళ్ళు రాశారు. నువ్వు కాంపిటీషన్‌కి పంపిన ఫోటోకి ఫస్టు ప్రైజు వచ్చిందట!....." రాంబాబు చేతికి ఉత్తరం ఇచ్చింది.

"యాహూ...." అని సంతోషంతో అరిచి సరోజని ఎత్తుకుని గిరగిరా తిప్పి మంచంమీద కూర్చోబెట్టి తనుకింద కూర్చున్నాడు.

"అదేం అక్కడ కూర్చున్నావ్?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

"మంచంమీదే నీ పక్కన కూర్చుందామనుకున్నాను గానీ నిన్ను గిరగిరా తిప్పడంవల్ల కళ్ళు తిరిగి తూలికింద పడ్డాను.... అంతేగాని నేను కిందకూర్చోలేదు" అంటూ లేచి సరోజ పక్కన కూర్చున్నాడు రాంబాబు.

"ఆ ఉత్తరంలో చివరగా రాశారు చూశావా.... వాళ్ళు వచ్చే నెలలో నిర్వహించే

ఫోటో కాంపిటీషన్‌లో కూడా నిన్ను మళ్ళీ పాల్గోమంటూ రాశారు...."

"బాబోయ్.... ఇంక ఈ కాంపిటీషన్లు నాకొద్దు.... ఇప్పటిదాకా అయిన అనుభవం చాల్దా...." అన్నాడు రాంబాబు.

ఇద్దరి మధ్య కాస్సేపు మౌనం తాండవించింది.

"ఏమైనా చెప్పు రాంబాబూ" అంది నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ సరోజ.

"ఏం చెప్పను?...." నేలమీద బొటన వేల్తో రాస్తూ అన్నాడు రాంబాబు.

"ఏమైనా సరే....."

రాంబాబు ఎదురుగా ఉన్న టీపాయ్ మీది పాలగ్లాసు అందుకుని సరోజవైపు గ్లాసుని చాచాడు.

"నువ్వు తాగు...." అంది సరోజ.

"ఉహు.... నువ్వే..... సగం నాకివ్వు"

సరోజ రాంబాబు చేతిలోని పాలగ్లాసు అందుకుని మళ్ళీ టీపాయ్ మీదే పెట్టేసి రాంబాబు

తలని రెండుచేతుల్లోకి తీసుకుని తన గుండెలకి అదుముకుంది.

రాంబాబు సిగ్గుల మొగ్గ అయ్యాడు ఇంక వాళ్ళ పడకగదిలోకి మనం తొంగి చూడడం భావ్యం కాదు కాబట్టి ఇక్కడే ఆగిపోదాం......

.............సమాప్తం..........